క్లుప్తంగా

21న హనుమాన్ శోభాయాత్ర



ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో ఈ నెల 21న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు, మహిమలూరు, రామస్వామి పల్లి గ్రామాల్లో గురువారం వారు కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పశుగ్రాసం సాగుపై అవగాహన



సంగం: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మర్రిపాడు పశువైద్యశాలలో పశువైద్యాధికారిణి సుజన ఆధ్వర్యంలో పశుగ్రాసం సాగుపై పాడి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ జయచంద్ర పాల్గొని పశుగ్రాసంలో రకాలు, వాటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పాడిరైతులు పశుగ్రాసంతో పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటసాగు పత్రాలపై అవగాహన

అనుమసముద్రంపేట: మండలంలోని గుంపర్లపాడు, జమ్మవరంలోని రైతుసేవా కేంద్రాల్లో పంటసాగు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ టీ రజని మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 20వ తేదీ వరకు పంట సాగు పత్రాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కే చిరంజీవి, వీఆర్వో, ఎస్వీ రమణయ్య, ఎం గణేష్, వీపీఏలు ఎం శ్రీనాథ్, టీ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

సీతారామపురం: కౌలురైతులకు కౌలు పత్రాల పంపిణీకి గానూ మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏఓ చెన్నారెడ్డి గురువారం తెలిపారు. 12న పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి, 15న సీతారామపురం బిట్-1, 2, 16న సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, 18న నెమళ్లదిన్నె, బాలాయపల్లి, 19న బసినేనిపల్లి రైతుసేవా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రూ.2.19 లక్షల ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం

అనుమసముద్రంపేట: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో రూ.2.19 లక్షల మేర అవినీతి జరిగినట్లు జిల్లా అడిషనల్ పీడీ విజయలక్ష్మి తేల్చారు. 2023-4 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను బుధవారం నిర్వహించిన విషయం తెలిసిందే. మండలంలోని 19 పంచాయతీల్లో రూ.10 కోట్లతో 975 పనులు చేపట్టారు. ఈ పనులను తనిఖీ చేసిన సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అక్రమాలపై బహిరంగ విచారణ జరిపిన అడిషనల్ పీడీ ఉపాధి సిబ్బంది రూ.2.19 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లు తేల్చారు. వారి నుంచి నగదు రికవరీ చేయాలని మండలాధికారులను ఆదేశించారు.

గంబూసియా చేపల విడుదల



అనుమసముద్రంపేట: స్థానిక హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలోని కోనేటిలో వైద్యాఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గంబూసియా చేపలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సబ్‌యూనిట్ మలేరియా నివారణాధికారి ఖాదర్‌బాషా మాట్లాడుతూ నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. దోమల నివారణకు కోనేటిలో చేపల లార్వాను తినే గంబూసియా చేపలను వదిలినట్లు తెలిపారు.

ఆత్మకూరురూరల్: వాశిలిలోని కోనేరులో వైద్యాఆరోగ్య శాఖ అధికారులు గంబూసియా చేపలను గురువారం విడుదల చేశారు. మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూష కుమారి, దేవానంద్, సూచనల మేరకు దోమల వ్యాప్తిని అరికట్టేందుకు దోమల లార్వాను తినే గంబూసియా చేపలను కోనేటిలో విడుదల చేసినట్లు ఆత్మకూరు సబ్‌యూనిట్ మలేరియా నివారణాధికారి ఖాదర్‌బాషా తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ లలిత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఏఎస్ఎం నాగేశ్వరి, ఆశ వర్కర్లు వరలక్ష్మి, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

బాబు మార్కు మోసం





తల్లికి వందనంపై నాలుక మడత



- ఎన్నికలకు ముందు ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని హామీ
- ఇప్పుడేమో కుటుంబంలో ఒకరికి మాత్రమేనని జీఓ

రూ.45వేలు వస్తాయని ఆశించా



నాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరిని సీతారామపురంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో, మరొకరిని గౌతమి హైస్కూల్‌లో చదివిస్తున్నా.ఇప్పటికే స్కూల్ యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. తల్లికి వందనం ద్వారా ముగ్గురు విద్యార్థులకు రూ.45 వేలు వస్తాయని ఆశించా. తీరా ఇప్పుడు ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో షాక్‌కు గురయ్యా.

– మండ్ల మనోజ, సీతారామపురం

హామీని నిలబెట్టుకోవాలి



తల్లికి వందనం ద్వారా బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలి. నాకు ఇద్దరు పిల్లలు. సీతారామపురం హైస్కూల్‌లో చదువుతున్నారు. రూ.30 వేలు వస్తాయని ఆశించా. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఒక్కరికే రూ.15 వేలు అని చెప్పడంతో అవాక్కయ్యా.

– షేక్ మహబూబ్‌చాంద్, సీతారామపురం

మోసం చేయడం తగదు



నాకు ఇద్దరు పిల్లలు. కుమారుడు కావలిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె కొమ్మి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తల్లికి వందనం ద్వారా ఇద్దరికి కలిపి రూ.30 వేలు వస్తే కుమారుడి చదువుకు సరిపోతుందనుకున్నా. ఇప్పుడు ఒక్కరికే ఇస్తామని మోసం చేయడం తగదు.

–బీ సుమతి, లింగసముద్రం

ఉదయగిరి/కావలి/ ఆత్మకూరు: ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు తన మార్కు రాజకీయాన్ని మరోసారి చూపించారు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు గుప్పించిన ఆయన అధికారంలోకి రాగానే నాలుక మడత వేయడం ప్రారంభించారు. ఇప్పటికే ఉచిత ఇసుక హామీని తుంగలో తొక్కిన బాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాల అమల్లోనూ కోతలు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'అమ్మఒడి' స్థానంలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ రూ.15వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదరగొట్టారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మెలిక పెట్టారు. తాజాగా విడుదల చేసిన తల్లికి వందనంకు సంబంధించిన జీఓలో తెల్లకార్డు కలిగిన కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఒక్కరికే ఏడాదికి రూ.15వేలు మాత్రమే అందజేస్తామని ప్రకటించారు. 75 శాతం హాజరు ఉన్న విద్యార్థుల తల్లులకు మాత్రమే నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లిదండ్రులు షాక్‌కు గురవుతున్నారు. నేను మారాను అని పదే పదే చెప్పిన బాబు అధికారంలోకి వచ్చాక నేను మారలేదు అని నిరూపించుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు సుమారు 50వేల మంది వరకు ఉన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వీరందరికీ ఏటా రూ.15వేలు చొప్పున నగదు అందజేయాలి. కానీ ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనంకు సంబంధించిన జీఓలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని ఒక్కరికే ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ లెక్కన దాదాపు 20వేల మంది విద్యార్థులకు కోత పడే అవకాశం ఉందని మేధావి వర్గాల సమాచారం.
- కావలి నియోజకవర్గంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 16,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీరందరికి తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో పేర్కొన్న తెల్లకార్డు కలిగిన, 75శాతం హాజరు నిబంధనలతో నియోజకవర్గంలో 30 శాతం మందికి కూడా పథకం అందే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వాలి



నాకు ఇద్దరు కుమారులు. ఒకరు వింజమూరులోని నారాయణ పాఠశాలలో ఏడో తరగతి, మరొకరు దుత్తలూరులోని విశ్వతేజ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఫీజులకు ఇబ్బంది ఉండదని సంతోషించా. ఇప్పుడు ఒక్కరికే రూ.15వేలు ఇస్తామనడం మోసం చేయడమే.

–అన్నంరెడ్డి జ్యోతి, దుత్తలూరు

అప్పులు చేయాల్సిందే



నాకు ఇద్దరు పిల్లలు. ఎన్నికల సమయంలో తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు నగదు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో నమ్మా. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించా. వారు ఫీజులు వెంటనే కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పుడు ఒక్కరికే రూ.15వేలు అందజేస్తామని ప్రకటించడం దారుణం. బాబు మాటలు నమ్మి మోసపోయా. ఫీజులకు అప్పులు చేయాల్సిందే.

– కాలే గిరిజ, డీ చెరువుపల్లి

ఫీజులకు ఇబ్బంది పడుతాం



నాకు ఇద్దరు పిల్లలు. పాప ఏడో తరగగతి, బాబు ఐదో తరగతి చదువుతున్నారు. ఇద్దరిని ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నా. చంద్రబాబు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఫీజులకు ఇబ్బంది ఉండదని సంతోషించా. ఇప్పుడు ఒక్కరికే రూ.15వేలు ఇస్తే ఫీజులకు ఇబ్బందులు పడుతాం.

– దేవరపల్లి లావణ్య,బ్రాహ్మణక్రాక

ఇద్దరు బిడ్డలకూ ఇవ్వాలి



నాకు ఇద్దరు కుమారులు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ఒక్క బిడ్డకు మాత్రమే అందిస్తామని చెప్పడం సమంజసం కాదు. ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు బిడ్డలకు రూ. 30వేలు అందించాలి.

– నలతాటి లావణ్య, కృష్ణారెడ్డిపాళెం

మాట తప్పడం సరికాదు



నేను హోటల్‌లో పనిచేస్తా. నా భర్త కూలీ పనులకు వెళ్తాడు. మాకు నలుగురు ఆడపిల్లలు. పెద్ద అమ్మాయి టీటీసీ పూర్తి చేసింది. మిగిలిన ముగ్గురు పిల్లలను కష్టపడి చదివిస్తున్నాం. తల్లికి వందనం కింద ముగ్గురు పిల్లలకు రూ.15వేల చొప్పున వస్తే చదువులకు ఇబ్బంది ఉండదని ఆశ పడ్డాం. ఇప్పుడు ఒక్కరికే రూ.15వేలు ఇస్తామని చంద్రబాబు మాట తప్పడం సరికాదు.

– తురిమెర్ల గురవమ్మ, ఆత్మకూరు

మోసం చేయడం సరికాదు



నాకు ఇద్దరు పిల్లలు. కూతురు నాల్గో తరగతి, కుమారుడు మూడో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.30వేలు వస్తాయని పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నా. ఇప్పుడు ఒక్కరికే రూ.15వేలు అందజేస్తామని ప్రకటించడంతో అవాక్కయ్యాం. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేయడం సరికాదు.

– ఏలూరు సింధూజ, ఆత్మకూరు

చంద్రబాబు నైజం తెలిసింది



నాకు ఇద్దరు పిల్లలు. చంద్రబాబు ఇచ్చిన తల్లికి వందనం హామీ మేరకు ప్రతి విద్యార్థికి రూ.15వేలు వస్తాయని ఆశించా. చదువు ఖర్చులకు ఉపయోగపడుతాయని భావించా. ఈ రోజు ఒక్కరికే రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం దారుణం. చంద్రబాబు మోసపూరిత నైజం తెలిసింది.

–ఇమ్మరాజు గోవిందమ్మ, దేవరాయపల్లి

హామీ నెరవేర్చాలి



నాకు ఒక కొడుకు, ఒక కూతురు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం బుచ్చిలోని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించా. తల్లికి వందనం ద్వారా ఇద్దరికి రూ.30వేలు వస్తాయనుకున్నా. ఫీజులకు ఇబ్బంది ఉండదని ఆశపడ్డా. అయితే ఒక్కరికే పథకం వర్తింపజేయడంతో దిక్కుతోచడంలేదు. ఇలా ఇచ్చిన మాట తప్పడం చంద్రబాబుకు మంచిదికాదు.

–తోకల శిరీషా, దువ్వూరు

ఇద్దరు పిల్లలకు వర్తింపజేయాలి



నాకు ఇద్దరు పిల్లలు. జెండాదిబ్బ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా. మాది పేద కుటుంబం. తల్లికి వందనం ద్వారా ఇద్దరు పిల్లలకు రూ.30వేలు వస్తే చదువు ఖర్చులకు ఉపయోగపడతాయని ఆశపడ్డా. కానీ ఒక్కరికి మాత్రమే నగదు ఇస్తారని తెలిసి ఆవేదనగా ఉంది. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలకు పథకాన్ని వర్తింపజేయాలి.

–బీ సుభాషిణి, జెండాదిబ్బ

బాబును నమ్మి మోసపోయాం



నాకు ఇద్దరు ఆడపిల్లలు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్నారు. తల్లికి వందనం నగదు వస్తుందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నా. ఈ రోజు ఒక్కరికే తల్లికి వందనం నగదు ఇస్తామనడం తగదు. బాబును నమ్మి మోసపోయాం.

–షేక్ షకీలా, ఆత్మకూరు

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

సంగం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పదోతరగతిలో ప్రతిభకనబర్చి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గాంధీజనసంఘం ఉన్నత పాఠశాలకు చెందిన పద్మినేని అవినాష్, తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం ప్రదీప్తి, టీ మౌనికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వారిని మండల విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్మకూరు: పట్టణంలోని పేరారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వేదసరస్వతి పదోతరగతిలో ప్రతిభకనబర్చి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఇడుపులపాయ క్యాంపస్‌లో సీటు సాధించినట్లు హెచ్‌ఎం సోమవరపు భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

దుత్తలూరు: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన బీ తేజస్విని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభకనబర్చి ట్రిపుట్ ఐటీకి ఎంపికైంది. ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించినట్లు ప్రిన్సిపల్ సైమన్‌రావు తెలిపారు.

చేజర్ల: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదోతరగతిలో ప్రతిభకనబర్చి ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. నాగులవెలటూరుకు చెందిన ఎస్ జ్యోష్ణప్రియ, ఎస్ అమరేశ్వరి, చేజర్లకు చెందిన వీ అభిరామ్, ఎస్‌కే సుజనాభాను, ఎస్ సుచిత్ర, మాముడూరుకు చెందిన కే మహిధర్ ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వారిని విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, మస్తానయ్య, హెచ్‌ఎంలు హైమావతి, శైలజ తదితరులు అభినందించారు.

దాతల సేవలు ఆదర్శనీయం



డార్మెటరీని ప్రారంభించిన దాతలు, అధికారులు

సోమశిల: తన స్వగ్రామంపై మమకారంతో ప్రవాస భారతీయులు బోయళ్ల జనార్దన్‌రెడ్డి తన సొంత నిధులు లక్షలాది రూపాయలతో రేవూరు బీసీ బాలికల వసతిగృహ విద్యార్థినుల కోసం డార్మెటరీ నిర్మించడం ఆదర్శనీయమని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య కొనియాడారు. అనంతసాగరం మండలం రేవూరు బీసీ బాలికల వసతిగృహంలో ప్రవాస భారతీయుడు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి తన భార్య బోయిళ్ల లక్ష్మీతేజ జ్ఞాపకార్థంగా తేజోసాయి ట్రస్టు ద్వారా డార్మెంటరీని నిర్మించారు. ఈ డార్మెంటరీని కుమార్తె బోయళ్ల సాయిప్రవర్తిక చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి హాజరై దాతలను అభినందించారు. అనంతరం దాతలను ఏబీసీడబ్ల్యూ ఎం శ్రీదేవి, సంక్షేమ అధికారిణి మల్లీశ్వరితో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అల్లంపాటి వెంకటేశ్వరరెడ్డి, బోయిళ్ల కొండారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యల్లారెడ్డి, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ఆత్మకూరు మండలం వెన్నవాడలో..



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరికుంటపాడు: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనిలో కాదని వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీరభద్రయ్య పేర్కొన్నారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవితకు బాటలు వేయాలని కోరారు. ఉపాధ్యాయులు సుభద్ర, మౌలాలి, చంద్రమౌళి, రంగయ్య, సుజాత, సుజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: నేడు బడికిపోతా, విద్యాప్రవేశం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాల పరిధిలో విద్యారులతో కలిసి ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎం కలిశెట్టి రవీంద్ర, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై వసంతరావు గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

సంగం: భార్య అదృశ్యంపై భర్త సంగం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. జెండాదిబ్బ పంచాయతీ మజారా పుట్టావారిగుంటకు చెందిన కరకంబాకం లక్ష్మీనారాయణ, సునీత దంపతులు. ఇరువురి మధ్యన నాలుగు రోజుల క్రితం కుటుంబ కలహాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈ నెల 9న సునీత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త సంగం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

ఆత్మకూరు: హైకోర్టు ఆదేశాల మేరకు ఇకపై ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సూచించారు. గురువారం ఆయన హైకోర్టు ఉత్తర్వులను వివరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 3,703 ప్రమాదాల్లో అధిక భాగం హెల్మెట్ లేని ప్రయాణికులే మృతి చెందారని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులు పట్టుబడితే శిక్ష, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

145 మందికి బీసీజీ వ్యాక్సిన్

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 145 మంది వయోజనులకు వైద్యాఆరోగ్య సిబ్బంది గురువారం బీసీజీ వ్యాక్సిన్‌ను వేసినట్లు వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కరీష్మా తెలిపారు. మండలంలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్‌కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ నియంత్రణలో భాగంగా ప్రభుత్వం వయోజనులకు మందుస్తుగా బీసీజీ టీకాను వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమ, గురువారాల్లో సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది టీకాను వేస్తున్నారని, వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్న కుటుంబం..చింతలేని కుటుంబం



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ఏఎస్‌పేటలో..

ఉదయగిరి: చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని వైద్యాధికారిణి వినీత పేర్కొన్నారు. ప్రపంచ జనాభా నియంత్రణా దినోత్సవాన్ని పురస్కరించుకుని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి వినీత మాట్లాడుతూ అధిక జనాభా వల్ల తలెత్తే ఇబ్బందులను వివరించారు. చిన్న కుటుంబమే మేలని, ఇద్దరు పిల్లలు కన్నా ఎక్కువ వద్దని సూచించారు. మహిళలు కాన్పుల మధ్య ఎడం ఉండేలా చూసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ శశికుమారి, హెచ్‌ఈ కే వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యా ఆరోగ్య సిబ్బంది జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. చిన్నయ్య, శ్రీనివాసులు, ఫణీంద్రరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: వరికుంటపాడులో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కరీష్మా ఆధ్వర్యంలో జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ వెంకటయ్య, స్టాఫ్ నర్స్ రోజారమణి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యా ఆరోగ్య సిబ్బంది జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అధిక జనాభాతో తలెత్తే ఇబ్బందులు, కుటుంబ నియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి స్వప్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ యార్డు పరిశీలన



మర్రిపాడు: స్థానిక ఇసుక స్టాక్ యార్డును ఆత్మకూరు ఆర్డీఓ మధులత గురువారం పరిశీలించారు. ఇసుక లోడింగ్ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుకను అందించాలని వారికి సూచించారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దార్ సీతారత్నం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి వద్ద ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని ఆత్మకూరు ఆర్డీఓ మధులత గురువారం పరిశీలించారు.అనంతరం ఆనకట్ట వద్ద టూరిజం శాఖకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించారని పలువురు ఫిర్యాదు చేసి నేపథ్యంలో పరిశీలించారు. సర్వే నిర్వహించి ఆక్రమణలు జరిగి ఉంటే వెంటనే తొలగించి హద్దులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణారెడ్డి, వీఆర్వోలు వెంకట్, అనూష, సర్వేయర్లు రవి, మీరావలి ఉన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: ప్రాణాంతకమైన డెంగీ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తగా ఉండాలని అర్బన్ వైద్యశాల డాక్టర్ అస్మా అన్నారు. పట్టణంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని గురువారం నిర్వహించారు. అర్బన్ వైద్యశాల నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సీతారామపురం: డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు డెంగీ, మలేరియాపై వైద్యురాలు స్వప్నారెడ్డి అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడంతో పాటు దోమతెరలు వాడడం దోమలను అరికట్టవచ్చన్నారు. సబ్‌యూనిట్ అధికారి నౌషాద్, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.